రెండేండ్లలో గుంతలు లేని రోడ్లు

హిమాయత్‌నగర్‌లో ప్యాచ్ వర్కు పనులను పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

మొయినాబాద్, నవంబర్ 11: తెలంగాణలో ప్రతి గ్రామానికీ రెండేండ్లలో గుంతలు లేని రోడ్లను అభివృద్ధి చేస్తామని రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చే జెట్ మిషన్‌ను ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఆర్‌డీవో చంద్రకళ, తహసీల్దార్ గౌతం కుమార్, టీపీసీసీ సభ్యుడు దర్శన్, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి భీంభరత్, పార్టీ మండల అధ్యక్షుడు మాణెయ్య, సీనియర్ నాయకులు మహేందర్, రాజు, గణేశ్, రాంరెడ్డి,యాదయ్య, రాజూగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో మైనార్టీ వెల్ఫేర్ డే

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయాంజాల్, నవంబర్ 11: మొట్ట మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి సందర్భంగా సోమవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడలో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో మైనార్టీ వెల్ఫేర్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అబుల్ కలాం అజాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేడుకల సందర్భంగా ఆటలపోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ అయిలయ్య, నాయకులు ధన్‌రాజ్ గౌడ్, వివిధ కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డైనేజీ పనులకు శంకుస్థాపన

మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూర్‌లో రూ.43 లక్షలతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ అయిలయ్య, కౌన్సిలర్ శివలింగం, నాయకులు ధన్‌రాజ్, వంగేటి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

పడకల్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, నవంబర్ 11: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. సోమవారం తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్, తలకొండపల్లి, వెల్జాల్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను చైర్మన్ గట్ల కేశవరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర నాయకుడు మోహన్‌రెడ్డి, బ్లాక్, మండల పార్టీ అధ్యక్షులు నర్సింహా, ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీశైలం, రమేశ్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ అంబాజీ, నాయకులు భగవాన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్యగుప్తా, కృష్ణ, చెన్నకేశవులు, రేణూరెడ్డి, శ్రీనివాసాచారి, జైపాల్‌రెడ్డి, యాదగిరి, సురేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

■ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
■ ఎలికట్ట, చౌదరిగూడెంలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

దళారులను నమ్మి మోసపోవద్దు

షాద్‌నగర్ రూరల్ :ఎలికట్టలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్, నవంబర్ 11: దళారుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రైతులకు సూచించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట, చౌదరిగూడ మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయిస్తే అధిక లాభాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి సుధాకర్, వ్యవసాయ శాఖ ఏడీ పీఏసీఎస్ చైర్మన్ బక్కన యాదవ్, వైస్ చైర్మన్ పాండురంగారెడ్డి, మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్, సీఈవో రఘునందన్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, చెన్నయ్య, బాబర్ ఖాన్, బాల్‌రాజు, సయ్యద్‌సాధిక్, యాదయ్య, బాబునాయక్, పురుషోత్తంరెడ్డి, ఇబ్రహీం, రవీందర్ పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గ్రామ పరిధిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం 10వ జోనల్ స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ ప్రారంభించారు. ఈ పోటీల్లో 18 పాఠశాలల నుంచి 1400మంది విద్యార్థినులు పాల్గొన్నడం సంతోషకరమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకులం కార్యదర్శి సంతోషి, డీసీవో ధనలక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ విద్యులత, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

షాద్‌నగర్‌టౌన్ : షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి దాతలు సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. కళాశాల భవన నిర్మాణానికి పట్టణానికి చెందిన దండు శరత్‌బాబు, వాసు రూ.5 లక్షలు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్‌సాదిక్ రూ.2,22,222, బీజేపీ నాయకుడు చెంది మహేందర్‌రెడ్డి రూ.1,11,111, కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు ఇబ్రహీం రూ.లక్షా16వేలు, విశ్రాంత ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి రూ. 75వేలు మొత్తం రూ. 10,24,333 చెక్కులను సోమవారం ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆధునాతన హంగులతో నిర్మించబోతున్నామన్నారు.

చేగూరులో..

నందిగామ : మండల పరిధిలో చేగూర్ పీఏసీఎస్ చైర్మన్ అశోక్ ఆధ్వర్యంలో సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ పద్మా రావు, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి గింజనూ కొంటాం

బాచారంలో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ డీఎం గోపీకృష్ణ

రంగారెడ్డి, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లాలో వర్షాకాలంలో రైతులు సాగు చేసిన వరి పంటలో ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి గోపీకృష్ణ అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రైతుల కల్లాల వద్ద నిల్వ ఉంచిన వరి ధాన్యాన్ని పరిశీలించిన నేపథ్యంలో ఆయన సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బాచారం గ్రామంలో రైతుల కల్లాల వద్ద ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 45కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించుకోవాలన్నారు. అలాగే, సన్న వరిధాన్యానికి రూ.500బోనస్‌ను ప్రభుత్వం అందజేస్తున్నదని ఆయన తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలి

సీపీఎం జెండాను ఎగురవేసిన యాదయ్య

తుర్కయాంజాల్, నవంబర్ 11: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి యాదయ్య అన్నారు. ఆదివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడ సుందరయ్య నగర్ కాలనీలో పద్మశాలి భవన్ సీతారాం ఏచూరి ప్రాంగణంలో సీపీఎం పార్టీ మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యాదయ్య పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు కిషన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డివిజన్ సహాయ వ్యవసాయ అధికారి ఆదిలక్ష్మి

ఆమనగల్లు, నవంబర్ 11: కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకువచ్చే రైతులు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఆమనగల్లు డివిజన్ సహాయ వ్యవసాయ అధికారి ఆదిలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్‌లోని పీఏసీ ఎస్ వరి ధాన్యం కొనుగోలు కేం ద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధాన్యం తేమ శాతం 17 లోపు ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రానికి తాలు గింజలు లేకుండా ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ పొందాలని రైతులకు సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్, పీఏసీఎస్ సీఈవో గోరటి దేవేందర్, ఏఈవో నిఖిత ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొల్కులపల్లి పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

మాడ్గుల, నవంబర్ 11: మండల పరిధిలోని కొల్కులపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కొత్త పాండు గౌడ్, వెంకటేశ్ గౌడ్, లక్ష్మయ్య, వాసుదేవ్, మధుకర్, వెంకట్ రెడ్డి, సాయిరెడ్డి, కృష్ణ, మదర్, వనజాత, స్వప్న, మల్లమ్మ, శిరీష, రాజేశ్వరి, అనిత, తదితనులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

సీఐకి రూ.10వేలు అందజేస్తున్న మాజీ సర్పంచ్

షాబాద్, నవంబర్ 11: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని షాబాద్ పోలీస్ ఇన్స్పెక్టర్ కాంతారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్‌లో సాంకేతిక లోపంతో సీసీ కెమెరాల మరమ్మతుల కోసం మాజీ సర్పంచ్ మునగపాటి నర్సింహులు రూ.10వేల విరాళం పోలీస్‌స్టేషన్‌లో సీఐకి అందజేశారు. ఈ సందర్భంగా సీఐ కాంతారెడ్డి మాట్లాడుతూ... గ్రామాల్లో దాతలు ముందుకొచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు నవీన్‌రెడ్డి, సతీశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

15 నుండి మైసిగండి మైసమ్మ జాతర

కడ్తాల్, నవంబర్ 11: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవత జాతర ఉత్సవాలు ఈ నెల 15నుంచి ప్రారంభంకానున్నాయి. ఆలయానికి రకరకాల పూలు, మామిడి, కొబ్బరి తోరణాలు, విద్యుత్ దీపాలతో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరిస్తున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆరు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. 15న కార్తిక పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి క్షీరాభిషేకం, 16న రాత్రికి పుష్ప రథోత్సవం (చిన్న తేరు), 17న రథోత్సవం (పెద్ద తేరు), 18 నుంచి 20వరకు శతచండీ హోమాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 11: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ పరిధిలోని మంగల్‌పల్లిగేటు సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. బీఎన్ రెడ్డిలోని నందిహిల్స్‌కు చెందిన పోలేపాలక సాయిలు అనే వ్యక్తి తన భార్య రాములమ్మ, కుమారుడితో కలిసి బైక్‌పై ఇబ్రహీంపట్నంవైపు వెళ్తున్నాడు. మంగల్‌పల్లి సమీపంలో కళ్లజోడు కొనుగోలు చేసేందుకు రోడ్డుకు ఎడమవైపు బైకును ఆపాడు. వెనుక నుంచి వస్తున్న కారు డ్రైవర్ సుధాకర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ఆపి ఉన్న బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో రాములమ్మ (35) అక్కడికక్కడే మృతి చెందింది, అరుణ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రాములమ్మ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ఏరియా దవాఖానకు తరలించి మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సదర్ ఉత్సవాల్లో ఇరు వర్గాల ఘర్షణ

షాద్‌నగర్, నవంబర్ 11: పట్టణంలో ఆదివారం రాత్రి అఖిల భారత యాదవ మహాసభ, యాదవ సదర్ ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. బహుమతులు ప్రదానంలో తలెత్తిన వివాదంతో వేదికపైన ఘర్షణకు దిగారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన యాదవులు దున్నపోతుల ప్రదర్శన చేసినప్పటికీ తమ అనుకూల వర్గానికి ప్రాధాన్యతనిస్తూ ఇతరులను చిన్నచూపు చూశారని ఓ వర్గం యాదవులు వివాదానికి తెరలేపారు. దీంతో ఇరు వర్గాలు ఘర్షణ దిగి గాయపరుచుకున్నారు. గ్రహించిన పోలీసులు హుటాహుటిన వేదిక వద్దకు చేరుకుని లాఠీచార్జి చేసి చెదరగొట్టారు. ఈ ఘటనలో యాదవ సంఘానికి చెందిన శ్రీనివాస్‌యాదవ్‌కు గాయాలయ్యాయి.

దాతల సాయంతో తరగతి గదులకు మరమ్మతులు

ఆదిబట్ల, నవంబర్ 11: దాతల సాయంతో రెండు తరగతి గదులకు మరమ్మతులు చేపట్టామని ఆదిబట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పరమేశ్ అన్నారు. సోమవారం యునైటెడ్ స్టేట్స్ నుంచి విచ్చేసిన ఎస్ఎస్ఎస్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ షోరే ఇంటర్నేషనల్ దాత సహకారంతో రూ.లక్షా 53 వేలు వెచ్చించి మరమ్మతులు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో హీర్యానాయక్, కాంప్లెక్ హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, టీసీఎస్ ప్రతినిధులు ప్రవీణ్, సునీ ల్, నరసింహారాజు, పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రిటైర్డ్ ఎంఈవో మహేందర్, ఉపాధ్యాయులు భాషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏలకు గౌరవ వేతనం చెల్లించాలి

ఆదిబట్ల, నవంబర్ 11: ఐకేపీ వీఓఏలకు వెంటనే ప్రభుత్వం గ్రామ సంఘం నుంచి రూ.3వేల గౌరవ వేతనం చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కందుకూరు మండల కన్వీనర్ బాల్‌రాజ్, కడ్తాల్, తలకొండపల్లి మండలాల కన్వీనర్ పెంటయ్య, మహేశ్వరం కన్వీనర్ శేఖర్‌తో పాటు 50 మంది కార్మికులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్య తీసుకోవాలి

ఆదిబట్ల : ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని 10వ వార్డు కౌన్సిలర్, మాజీ వైస్ చైర్మన్ కళమ్మాజంగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో భాగంగా రంగారెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్వే చేయించి హద్దులు సూచించాలి

మాడ్గుల, నవంబర్ 11: కలకొండ గ్రామం నుంచి శనిగలగుట్ట తండా రోడ్డుకు ఇరువైపులా సర్వే నిర్వహించి హద్దులు సూచించాలని కలకొండ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ వినయ్‌సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ సర్పంచ్ పవన్ రెడ్డి, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, సైదులు, జైపాల్ నాయక్, లాలయ్య గౌడ్, రాంజి, శంకర్ లాల్, లక్ష్మణ్, శ్రీశైలం, నరేశ్, రఘు, భీంలాల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్, నవంబర్ 11: మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామ పంచాయతీలోని పంపుగూడెం గ్రామానికి చెందిన పోతుగంటి భారతమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు సోమవారం ఉదయం భారతమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని అన్మాస్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ పరామర్శించి రూ.3 వేలు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు అశోక్ రూ.2 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

నాబార్డ్ సమావేశంలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్, నవంబర్ 11: డీసీసీబీలకు నాబార్డు ద్వారా అందించే రాయితీ రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాతీయ నాబార్డు డెవలప్‌మెంట్ అధికారులు భూపేందర్‌సింగ్, ఉడిత్ ఆగర్వాల్ అన్నారు. తమిళనాడులోని మధురై పట్టణంలో జాతీయ నాబార్డు అధికారుల ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన డీసీసీబీ చైర్మన్లు, డైరెక్టర్లకు నిర్వహించిన సమావేశానికి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా పాల్గొన్నారు. బ్యాంకర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ వారి ఆహ్వానం మేరకు నాబార్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి హాజరైనట్లు వెంకటేశ్‌గుప్తా తెలిపారు. రైతులకు అన్ని విధాలా రుణాలు పొందే అంశాలపై అవగాహన కల్పించాలని అధికారులు వివరించినట్లు ఆయన తెలిపారు.

రావులపల్లికి వైకుంఠ రథం అందజేత

రావులపల్లి కలాన్ గ్రామానికి వైకుంఠ రథాన్ని అందజేసిన కృష్ణమూర్తి

చేవెళ్ల రూరల్, నవంబర్ 11: శంకర్‌పల్లి మండల పరిధిలోని రావులపల్లి కలాన్‌కు చెందిన వానరాసి కృష్ణమూర్తి కీర్తి శేషులు తన తండ్రి యాదయ్య, నాన్నమ్మ దస్తమ్మ జ్ఞాపకార్థం గ్రామానికి సొంత నిధులు వెచ్చించి సోమవారం వైకుంఠ రథం అందజేశారు. కార్యక్రమానికి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పామెన భీంభరత్ హాజరై వైకుంఠ రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి కృష్ణమూర్తిని గ్రామస్తులు, పలువురు నేతలు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నాయకులు బద్దం కృష్ణారెడ్డి, కౌన్సిలర్ శ్రీనాథ్ గౌడ్, పర్వేద మాజీ ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మార్కెట్‌లో వసతులు కల్పిస్తాం

పండ్ల మార్కెట్‌లో పండ్ల క్రయ విక్రయాలను పరిశీలిస్తున్న చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 11: గడ్డిఅన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్‌లో రైతులకు అన్ని వసతులు కల్పించి సమస్యలు లేకుండా చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌లో జరుగుతున్న క్రయ విక్రయాలు, వర్తకుల అమ్మకాలను సోమవారం పాలకవర్గ సభ్యులు, అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, డైరక్టర్లు జైపాల్‌రెడ్డి, అంజయ్య, లక్ష్మి, మచ్చందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, గణేశ్‌నాయక్, నరసింహ, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు గుప్తా, ఇబ్రహీం, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తున్న మోదీ

సమావేశంలో మాట్లాడుతున్న బాల మల్లేశ్

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 11: ఉపాధి హామీ చట్టాన్ని ప్రధాని మోదీ నీరుగారుస్తున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేశ్ అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యలు పరిష్కార మార్గాలు అనే సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని నరేంద్రమోదీ సర్కారు మతోన్మాదంతో కార్మిక వర్గాన్ని విడదీస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య, జిల్లా అధ్యక్షుడు జంగయ్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నర్సింహ, యాదయ్య, యాదిరెడ్డి, నాయకులు నీలమ్మ, నర్సింహ, నర్ల శ్రీశైలం, రాజూనాయక్, గాలయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

యాచారం, నవంబర్ 11: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రవినాథ్ అన్నారు. మండల పరిధిలోని నందివనపర్తిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. నిర్వాహకులతో మాట్లాడి రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచాలని సూచించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

కడ్తాల్, నవంబర్ 11: తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం దీక్షలో గ్రామానికి చెందిన శివలింగమ్మ, కవిత, బుజ్జమ్మ, నాగయ్య, మాణిక్యం, నర్సింహాగౌడ్, అంజయ్య, కృష్ణ, అశోక్, రాజు, లక్ష్మయ్య, మల్లయ్య, కూర్చున్నారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, నాయకులు ఆంజనేయులుగౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లి దర్శనానికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

యాచారం, నవంబర్11: కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల చేశారు గుర్తు తెలియని దుంగులు. తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న తులంన్నర బంగారం, 20 తులాల వెండిని అపహరించుకుపోయారు. ఈ ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నజ్దిక్‌సింగారంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. సీఐ నరసింహారావు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని నజ్దిక్‌సింగారం గ్రామానికి చెందిన కడారి వెంకటేశ్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సిద్దిపేటలోని కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వెళ్లాడు. దర్శనం అనంతరం సోమవారం సాయంత్రం తిరిగి తన స్వగ్రామానికి చేరుకున్నాడు. ఇంటికి వెళ్లి చూసే సరికి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని చూసి ఆశ్చర